క్లుప్తంగా

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కాంగ్రెస్ ఎస్సీ సెల్

జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ మోహన్

మొయినాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల జగన్‌మోహన్ అన్నారు. గురువారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా జిల్లాలో పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారన్నారు. ఉత్సవాలు, ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇచ్చిందని.. మండపాల వద్ద నిర్వాహకులను అధికారులు ఇబ్బంది పెట్టొద్దన్నారు. వినాయక ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలు కూడా సహకరించి శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.

పంట నమోదు తప్పనిసరి

ఏఈఓ శిరీష



మోత్కులగూడలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఈఓ శిరీష

నందిగామ: రైతులు తాము వేసిన పంటలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఈఓ శిరీష అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో గురువారం ఆమె పర్యటించి పలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ భూములలో ఏఏ పంటలను పండిస్తున్నారో వ్యవసాయశాఖ వద్ద నమోదు చేయించుకోవాలని, దీంతో పంటలను విక్రయించడం సులభతరం అవుతుందని తెలిపారు. అదేవిధంగా వరిపంట ఎరుపు రంగులోకి మారడంతో ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంట చేనులోని నిల్వ నీటిని తొలగించాలని, మళ్లీ నీరు పెట్టాలని సూచించారు.

మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: మున్సిపల్, మండల పరిధిలో 3 మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మండల పరిధిలోని కనకమామిడిలో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో పాటు జిల్లా కలెక్టర్ పేరుతో రూ.500 డీడీ తీసి దరఖాస్తుకు జతచేసి ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య



మాట్లాడుతున్న కిష్టయ్య

కేశంపేట: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, సూపరింటెండెంట్ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏపీఓ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌లతో జీవితాలు అంధకారం

అబ్దుల్లాపూర్‌మెట్: ర్యాగింగ్‌లకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకోవద్దని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. మండల పరిధి గుంతపల్లిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు. కళాశాల ఆవరణ, బయట ఎక్కడైనా తోటి విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకరిని మరొకరు ఇబ్బందులకు గురిచేస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ చేస్తే విధించి శిక్షలతో పాటు నమోదు చేసే సెక్షన్ల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ భద్యానాయక్, కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాళ్లు శేషతల్పసాయి, ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి బోసుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



చేవెళ్ల: రజకనగర్ కాలనీలో..



చేవెళ్ల: మల్లికార్జుననగర్ కాలనీలో పూజలో పాల్గొన్న స్థానిక నాయకులు, ప్రజలు



షాద్‌నగర్‌లో భానుతేజ ఆధ్వర్యంలో జరిగిన పూజ అనంతరం సెల్ఫీ తీసుకుంటూ..

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా వాడవాడలా వివిధ రూపాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యకు భక్తులు వివిధ పత్రాలు, పూలు సమర్పించి పూజలు చేశారు. ఉండ్రాళ్లు, చెరుకు గడలు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. దయుంచయ్యా దేవా అంటూ వేడుకున్నారు. గురువారం రెండోరోజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో వినాయకుడి పూజలో పాల్గొన్న గ్రామస్తులు



షాద్‌నగర్‌రూరల్: పూజలో పాల్గొన్న ఎస్‌ఐ రాంచందర్, గ్రామపెద్దలు



కొత్తూరు: తిమ్మాపూర్‌లో..



షాబాద్: మాచన్‌పల్లిలో..



శంకర్‌పల్లి: సింగాపురంలో..



శంకర్‌పల్లి: సరస్వతీదేవీ వీణ మీద వినాయకుడు



నందిగామ: పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు



షాద్‌నగర్: క్యాంపు కార్యాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: న్యూసిటీకాలనీలో పూజలో పాల్గొన్న భక్తులు



మొయినాబాద్: పూజలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని పార్టీ సీనియర్ నాయకుడు, కేశంపేట మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి అన్నారు. కేశంపేట గ్రామానికి చెందిన తలసాని పవన్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఇటీవల మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. తనతో పాటు మరో 50 మంది బీజేపీలో చేరినట్టు మీడియాలో తెలిపారు. ఇదే విషయమై మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన వారి వివరాలతో పాటుగా ఫొటోలను మీడియా ముందు తెలపాలన్నారు. పవన్‌కుమార్‌రెడ్డికి పార్టీలో ఎలాంటి పదవులు, సభ్యత్వాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతుంటే.. దీనిని జీర్ణించుకోలేని బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలకే కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరినట్టు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. అవసరమైన యూరియాను అందించకుండా కేంద్రంలో ఉన్న బీజేపీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చి యూరియా రైతులకు అందించే విధంగా కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను మళ్లీ తిరస్కరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విజయరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం



వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గంచెరువు వెంకటయ్య పదవీ విరమణ సన్మానసభ ఖానాపూర్‌గేట్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, జీహెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య దంపతులను వారు సన్మానించారు. విరమణ అనంతరం శేష జీవితం ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్‌లోని ఎంఈఓలు పురందాస్, అక్బర్, మల్లయ్య, పీఆర్టీయూ జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు పోచయ్య, జీహెచ్‌ఎం సంఘం నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ: మేకగూడ పీఏసీఎస్ ఎదుట యూరియా బస్తాల కోసం క్యూ కట్టిన రైతులు

యూరియా కోసం బారులు

- దుకాణాల వద్ద గంటల తరబడి క్యూ
- స్టాక్ దొరకకపోవడంతో నిరాశగా వెనుదిరిగిన రైతులు

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ పీఏసీఎస్ ముందు రైతులు యూరియా కోసం గురువారం క్యూ కట్టారు. ఇటీవల కురిసిన వర్షాలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పంటలకు యూరియా వేసే సమయం ఆసన్నమైంది. దీంతో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే యూరియా బస్తాల కోసం మేకగూడ పరిసర ప్రాంతాల రైతులు బారులు తీరారు. కాగా ఒక్కొక్క రైతుకు 2 బ్యాగుల చొప్పున అందజేశారు. కాగా చాలా మంది రైతులకు యూరియా లభించకపోవడంతో వారికి టోకెన్లు ఇచ్చి పంపించేశారు. టోకెన్లు పొందిన రైతులకు శుక్రవారం యూరియా అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి రామశివరావు తెలిపారు. అదేవిధంగా చేగూరు పీఏసీఎస్‌కు రెండు రోజుల్లో యూరియా రానున్నట్లు తెలిపారు.

నిరాశగా వెనుదిరిగి..

షాబాద్: వానాకాలం పంటల సాగు ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం నానా తంటాలు పడుతున్నారు. గురువారం మండల పరిధిలోని హైతాబాద్ సహకార సంఘం కార్యాలయంలో 200 బస్తాల యూరియా వచ్చింది. దీని కోసం 400 మంది రైతులు పీఏసీఎస్ కార్యాయలం వద్ద ఉదయం నుంచే బారులు తీరారు. ఒకరికి ఒక్క బస్తా ఇవ్వడంతో రెండు వంద మందికి సరిపోయింది. మిగతా రైతులు యూరియా దొరకక వెనుతిరిగి వెళ్లిపోయారు.

పోలీస్ పహారాలో పంపిణీ

కేశంపేట: మండల పరిధిలో కొత్తపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద, కేశంపేటలోని లక్ష్మీ ఏజెన్సీస్ దుకాణంలో పోలీసుల పహారా మధ్య నిర్వాహకులు యూరియాను పంపిణీ చేశారు. కొత్తపేటలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద 450 బస్తాలు (20.25 మెట్రిక్ టన్నులు), కేశంపేటలోని లక్ష్మీ ఏజెన్సీలో 670 బస్తాలు (30.15 మెట్రిక్ టన్నులు) అందుబాటులో ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే కేంద్రాల వద్దకు భారీగా చేరుకోవడంతో ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశంతో పోలీసుల పహారాలో క్యూలైన్‌లను ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. మండలానికి 3000ల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. ఇప్పటికే సుమారుగా 2200ల మెట్రిక్ టన్నులు వచ్చినట్టు మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. నానో యూరియాను 5వేల లీటర్ల వరకు విక్రయించినట్టు తెలిపారు.



కేశంపేటలో పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

ఓటరు జాబితా విడుదల

- ఓటర్లు, వార్డులు, పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రదర్శించిన అధికారులు
- 30వ తేదీవరకు అభ్యంతరాల స్వీకరణ

చేవెళ్ల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీలకు సంబంధించి ఓటర్ ముసాయిదాను వార్డుల వారీగా విడుదల చేసినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. గురువారం చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, కార్యదర్శులతో కలిసి ఆమె వార్డుల వారీగా ఓటరు జాబితా, వార్డుల విభజన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 25 పంచాయతీలలో మొత్తం 35,437 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 218 వార్డులు, 218 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని, ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 28 నుంచి 30వ తేదీవరకు తెలియజేయాలన్నారు. 29వ తేదీన జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం, 30న మండల స్థాయిలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఉంటుందని తెలిపారు. ఓటరు జాబితా, వార్డుల విభజనపై అభ్యంతరాలను అందిస్తే వాటిని డీపీఓ స్థాయిలో 31వ తేదీన పరిశీలన చేస్తారన్నారు. వచ్చే నెల సెప్టెంబర్ 2వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత బీఎల్‌ఓలకు, పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

పంచాయతీల వద్ద..

నందిగామ: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో నూతన ఓటరు లిస్టును గురువారం ఆయా పంచాయతీల కార్యదర్శులు నోటీస్ బోర్డులలో ప్రదర్శించారు. ఓటరు లిస్టులో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే చేయించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

30 వరకు అభ్యంతరాలు తెలపాలి

శంకర్‌పల్లి: మండలంలోని 24 గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో గురువారం ఓటర్ల జాబితా ముసాయిదా ప్రదర్శించినట్లు శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపాలకృష్ణ తెలిపారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సైతం ఏర్పాటు చేశామని, ఎవరైనా జాబితాపై అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 30వరకు తెలియజేయాలని సూచించారు.



చేవెళ్ల: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, కార్యదర్శులు



కేశంపేట: ఓటర్ జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు



మొయినాబాద్‌రూరల్: లిస్టును ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

కొత్తూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ప్రదర్శించిన జాబితాలో ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్లు, వార్డుల వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. అందులో ఏవైనా మార్పులు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30లోగా ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

వార్డుల వారీగా..

మొయినాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ వారీగా రూపొందించిన ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులో గ్రామ పంచాయతీ వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 19 గ్రామ పంచాయతీలలో 166 పోలింగ్ కేంద్రాలు, 30,250 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం గ్రామ పంచాయతీలలో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సూపరిండెంటెంట్ రెహమాన్, కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

30న నాయకులతో సమావేశం

కేశంపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం ఓటర్ ముసాయిదాను వార్డుల వారీగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యదర్శులు పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఓటర్ లిస్టులో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 30లోగా దరఖాస్తులను అందజేయాలని అధికారులు తెలిపారు. ఓటర్ జాబితాపైన 30న మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య తెలిపారు.

జాబితాలో అభ్యంతరాలు తెలియజేయండి

కొందుర్గు: ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా మడల పంచాయతీ అధికారికి తెలియజేయాలని ఎంపీడీఓ లక్ష్మి అనురాధ సూచించారు. గురువారం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా విభజించిన ఓటరు జాబితాలను విడుదల చేసి జీపీ కార్యాలయాల వద్ద నోటిస్ బోర్డుపై ప్రచురించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ గణపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.